



## వస్తోంది.. 'వందే భారత్'

- నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు నడవనున్నరైలు
- నేడు నాగ్‌పూర్‌లో ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ

5లో..



# 'మస్టర్ల' గోల్‌మాల్



బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేసుకుంటున్న కార్మికుడు

- రామగుండం పారిశుధ్య విభాగంలో అక్రమ దందా
- బయోమెట్రిక్ మస్టర్ల జాబితాల్లో దిద్దుబాట్లు
- నెలల తరబడి గైర్హాజరైన సిబ్బందికీ మస్టర్లు

కోల్‌సిటీ, సెప్టెంబరు 15: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లోని పారిశుధ్య విభాగంలో మస్టర్ల దందా కొనసాగుతోంది. రికార్డుల్లో కార్మికుల సంఖ్యకు క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న కార్మికుల సంఖ్యకు పొంతన లేక అధికారులు, ప్రజాప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మస్టర్ల అవకతవకలను నివారించేందుకు బయోమెట్రిక్ ప్రవేశపెట్టినా దాన్ని అపహాస్యం చేసే రీతిలో కార్యాలయ కేంద్రంగా దిద్దుబాట్ల దందా కొనసాగింది. రోజుల తరబడి గైర్హజర్ అయిన కార్మికులకు మస్టర్లు సర్దుబాటు చేసి సగం సగం అనే రీతిలో వ్యవహారం సాగించినట్టు ప్రచారం జరుగుతోంది.

### ● కార్యాలయ కేంద్రంగానే దందా..

రామగుండం నగరపాలక సంస్థలో మస్టర్ల సర్దుబాటు దందా కార్యాలయ కేంద్రంగానే జరిగినట్టు తెలుస్తోంది. బయోమెట్రిక్ మస్టర్ల జాబితా జోన్ల నుంచి కార్యాలయాలకు చేరగా ఇక్కడే కీలక ఉద్యోగులు సర్దుబాట్ల వ్యవహారానికి తెరతీసినట్టు తెలుస్తోంది. ఈ విధానాన్ని అనుసరించి మస్టర్ల జాబితా కార్యాలయానికి చేరింది. ముఖ్యంగా నాలుగు జోన్‌లలో పని చేస్తున్న కొందరు కార్మికుల మస్టర్లను పెంచారు. ఇందులో 90శాతానికి పైగా మహిళా కార్మికులే ఉన్నారు. కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఒక పర్మినెంట్ పారిశుధ్య ఉద్యోగి నెలల తరబడి గైర్హాజర్ ఉన్నా మస్టర్లు సర్దుబాటు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అలాగే లక్ష్మీనగర్, ఎల్‌బీనగర్, చంద్రబాబుకాలనీ, గంగానగర్, ఎన్‌టీపీసీ తదితర ప్రాంతాల్లో పని చేసిన కార్మికుల మస్టర్లలో దిద్దుబాట్లు జరిగాయి. ఒక్కొక్కరికి 8 నుంచి 15వరకు మస్టర్లను సర్దుబాటు చేశారు. డ్రైనేజీ క్లీనర్ ఒకరకు వారాల తరబడి గైర్హాజర్ అయినా అతడి పేర మస్టర్లు వేశారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన రికార్డుల్లో 8 నుంచి 10 మస్టర్లు ఉంటే వేతనాలు మాత్రం 20 నుంచి 22 మస్టర్లకు జరిగాయి. ఇందులో ముగ్గురు, నలుగురు పురుష కార్మికులు ఉండగా మిగతా వారంతా మహిళా కార్మికులు ఉండడం గమనార్హం. కాగా మస్టర్ల అవకతవకలపై పారిశుధ్య ఉద్యోగులను సంప్రదిస్తే అనాథ శవాల అంత్యక్రియలకు వినియోగించినందు వల్లే సర్దుబాట్లు చేశామంటూ చెప్పుకొచ్చారు. రామగుండం నగరపాలక సంస్థలో ఈ వ్యవహారం అధికారుల దృష్టికి వచ్చినా స్పందన లేనట్టు కనిపిస్తోంది.

### ● 448 మంది పారిశుధ్య కార్మికులు..

**రామగుండం** నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో 448మంది పారిశుధ్య కార్మికులు పని చేసున్నారు. వీరిలో డ్రైవర్లు, డ్రైనేజీ క్లీనర్లు, లిఫ్టర్లు, సూపర్‌వైజర్లు, స్వీపర్లు తదితర కార్మికులు ఉన్నారు. రామగుండం నగరపాలక విస్తరించి ఉన్న గోదావరిఖని, ఎన్‌టీపీసీ, యైటింక్లయిన్‌కాలనీ, రామగుండం, ఎఫ్‌సీఐ ఏరియా ప్రాంతాల్లోని 50డివిజన్లను 14జోన్లుగా విభజించి పారిశుధ్య సేవలందిస్తున్నారు. ఒక్కో జోన్‌కు మూడు నుంచి నాలుగు డివిజన్లు కేటాయించారు. ముగ్గురు పర్మినెంట్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్లు పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తారు. లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్ వంటి వ్యాపార కేంద్రాల్లో రాత్రిపూట స్వీపింగ్ కూడా జరుగుతుంది. కార్పొరేషన్‌లో మస్టర్ల వ్యవహారంలో అవకతవకలు జరుగుతున్నట్టు కొంత కాలంగా ఆరోపణలున్నాయి. క్షేత్రస్థాయిలో గైర్హాజర్ అయిన కార్మికులకు ఆబ్సెంట్లు వేసి కార్యాలయానికి పంపినా పారిశుధ్య విభాగంలోని బాధ్యులు దిద్దుబాటుకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. కార్పొరేషన్ రికార్డుల్లో కార్మికులు 448మంది ఉన్నా క్షేత్రస్థాయిలో అంతమంది సేవలందించడం లేదని, మస్టర్ల అవకతవకలు జరుగుతున్నందున బయోమెట్రిక్, ఫేస్ రికగ్నైజేషన్ హాజరును ప్రవేశపెట్టాలని కలెక్టర్ ఆదేశాలతో అమలు పరిచారు. గత నెలలో అన్నీ జోన్‌లలో బయోమెట్రిక్ విధానం అమలులోకి వచ్చింది.



దిద్దుబాటు చేసిన బయోమెట్రిక్ మస్టర్ల జాబితా

## లోక కల్యాణార్థం గణపతి హోమం

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



హోమం నిర్వహిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు దంపతులు

మంథని, సెప్టెంబరు 15: లోక కల్యాణార్థం గణపతి హోమం నిర్వహించినట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తెలిపారు. నియోజకవర్గ, రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా, సుఖశాంతులతో ఉండలాన కోరుకున్నట్లు తెలిపారు. మంథనిలోని రావుల చెరువుకట్టలో గణపతి శత వసంతోత్సవాల సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆయన సతీమణి, రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ దంపతులు ఆదివారం గణపతి హోమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, కౌశిక్‌రెడ్డిల వివాదం ఆ పార్టీ అంతర్గత అంశమని, దాన్ని వాళ్ళే పరిష్కరించుకోకుండా కాంగ్రెస్ పార్టీకి అంటగట్టడం సరికాదన్నారు. ఎవరు ఎంత తెలివైన వారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసే ప్రయత్నం చేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడ్డాక ఇక్కడ ఉన్న ప్రజలంతా తెలంగాణ ప్రజలేనన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ అంతర్జాతీయ స్థాయిలో తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

### బీజేపీకి అత్యధిక సభ్యత్వం

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 15: ప్రపంచంలోనే బీజేపీకి అత్యధికంగా సభ్యులు ఉన్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. ఆదివారం 28వ డివిజన్ సూర్యనగర్‌లో మచ్చ విశ్వాస్ ఆధ్వర్యంలో గడప గడపకు బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, నాయకులు క్యాతం వెంకటరమణ, కోమళ్ల మహేష్, భూమయ్య, కోడూరి రమేష్, పవన్, సాగర్ పాల్గొన్నారు.

## గుంతలమయమైన రోడ్డు..

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 15 : మండలంలోని కుర్మపల్లిలోని ప్రధాన చౌరస్తాలో రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు ప్రమాదకరంగా మారాయి. సర్పంచ్‌ల పాలన ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన వచ్చినప్పటికీ కూడా గ్రామాల్లోని రోడ్లకు మరమ్మతులు కరువయ్యాయి. ప్రతి వర్షకాలంలో ప్రధాన చౌరస్తాలో భారీ వాహనాలతో గుంతలు ఏర్పడి పలువురికి ప్రమాదకరంగా ఉన్నాయి. ఏర్పడ్డ గుంతల్లో పొద్దంతా దారి వెంట వెళ్తున్న వాహనదారులకు ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళల్లో గుంతలు కనపడక పలువురు ప్రమాదబారిన పడుతున్నారు. పంచాయతీ అధికారులు పలుమార్లు నామమాత్ర మరమ్మతులు చేపట్టినా కూడా ఫలితం లేకుండాపోయిందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డును మరమ్మతు చేసి ప్రమదాల నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కుర్మపల్లి ప్రధాన చౌరస్తాలో గుంతలు

### సీతారాం ఏచూరికి ఘన నివాళి

జ్యోతినగర్, సెప్టెంబరు 15 : సీపీఎం నేత సీతారాం ఏచూరికి స్థానిక 2వ డివిజన్ సీపీఎం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఇందిరమ్మ కాలనీలో జరిగిన కార్యక్రమంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సీపీఎం 2వ డివిజన్ ప్రధాన కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయ కులు లక్ష్మారెడ్డి, ఎన్.బిక్షపతి, ఎం.రామాచారి, రవిందర్, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, సాంబయ్య, కృష్ణారెడ్డి, గీత, మహిపాల్‌రెడ్డి, భాస్కర్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

**యైటింక్లయిన్‌కాలనీ :** సీతారం ఏచూరి మరణం ప్రజా ఉద్య మాలకు తీరని లోటని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఓసీపీ-3 కృషిభవన్‌లో యూనియన్ ఆధ్వర్యంలో ఏచూరీ సంతాప సభ జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీఐటీయూ నాయకుడు ఉల్లి మొగిలి, ఆర్జీ-2 సెక్రెటరీ కుంట ప్రవీణ్, నాయకులు ఎస్ వెంకన్న, సారంగం, రాంప్రసాద్, సంపత్‌కుమార్, లింగయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## రామగుండాన్ని వణికిస్తున్న చికున్ గున్యా

- కీళ్ల నొప్పులతో అవస్థలు.. నడవలేని స్థితిలో బాధితులు



ఆసుపత్రికి వచ్చి జ్వర పీడితులు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 15: నెల రోజులుగా ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో రోగాలు విజృంభిస్తున్నాయి. ఒక పక్క చికున్ గున్యా, మరో పక్క డెంగ్యూ విషజ్వరాలతో రామగుండం పారిశ్రామిక ప్రాంతం పడకేసింది. గోదావరిఖని ప్రభుత్వాసుపత్రితో పాటు ప్రైవేట్ ఆసుపత్రులు చికున్ గున్యా, డెంగ్యూ, వైరల్ ఫీవర్ బాధితులతో కిటకిటలాడుతున్నాయి. నెల రోజులుగా పారిశ్రామిక ప్రాంతంలో ఏ ఇంట చూసినా జ్వర బాధితులే కనిపిస్తున్నారు. ఇంట్లో ఒకరికి జ్వరం వస్తే ఇంటిల్లిపాది మొత్తం జ్వరంతో బాధపడుతున్నారు. 20ఏళ్ల తరువాత రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో చికున్ గున్యా తిరగబడడంతో కీళ్ల నొప్పులు అధికమై బాధితులు నడవలేని స్థితిలో బాధపడుతున్నారు. కొంత మంది లేవని స్థితికి చేరుకుంటున్నారు. గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో రోజూ 1300నుంచి 1500 ఓపీ వస్తుండగా ఇందులో ఎక్కువశాతం గున్యా, డెంగ్యూ కేసులు అధికంగా నమోదు అవుతున్నాయి. మొదట కీళ్ల నొప్పులు ప్రారంభమై ఆ తరువాత జ్వరంగా మారి బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా చాలా మందికి బెడ్లు దొరకక ఇబ్బందులకు గురవుతున్నారు. 20ఏళ్ల తరువాత రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో చికున్‌గున్యా తిరగబడడంతో చాలా మంది నొప్పులతో అవస్థలు పడుతున్నారు. ఈ నొప్పులు నెల నుంచి రెండు నెలల వరకు కూడా తగ్గడం లేదు. చాలా మందిలో బ్లడ్ ఇన్‌ఫెక్షన్లు పెరగడం, రక్తకణాలు తగ్గుతున్నాయి. ఇందులో చిన్నపిల్లలు కూడా ఎక్కువ మందికి గున్యా సోకడంతో పిల్లల పరిస్థితి దారుణంగా మారింది.

### దోమల నివారణకు చర్యలు చేపట్టని కార్పొరేషన్

వర్షాలతో చాలా చోట్ల నీళ్ల నిల్వ ఉండడం, ప్రధాన డ్రైనేజీల్లో దోమలు పెరిగిపోవడంతో మధ్యాహ్నం కుట్టే దోమతో గున్యా, డెంగ్యూ రోగాలు రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని వణికిస్తున్నాయి. కార్పొరేషన్ దోమల నివారణకు ఆయిల్ బాల్స్ కానీ, దోమల మందు కానీ ఇప్పటి వరకు పిచికారి చేయడం లేదు. నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్‌ను చల్లని దుస్థితిలో కార్పొరేషన్ ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కొత్త వైరస్‌తో ఒంటిపై దద్దుర్లు.. నల్లగా మారుతున్న ముక్కు.

ఈసీజన్‌లో కొత్త వైరస్ విజృంభిస్తుండడంతో ఒంటిపై దద్దుర్లతో పాటు చాలా మంది ముక్కు నల్లబడడం వంటివి కనబడుతున్నాయి. జ్వరం సోకిన బాధితులకు జ్వరం తగ్గిన తరువాత ఒంటినొప్పులు తీవ్రతరమై ఒంటిపై దద్దుర్లు, ముక్కు నల్లబడడం వంటివి చాలా మందిలో కనబడుతున్నాయి. ఇది కొత్త వైరస్ అని వైద్యులు చెబుతున్నారు. చాలా మంది గున్యా సోకిన వారు నడవలేని స్థితిలో ఉంటున్నారు. భుజాలపై ఎత్తుకుని ఆసుపత్రులకు రావడం, వీల్ చైర్‌లలో తీసుకువస్తున్న దృశ్యాలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో కనబడుతున్నాయి.

### ముందుకు సాగని జ్వరం సర్వేలు..

ఇంటింటా జ్వరం సర్వే నిర్వహించాలని ప్రభుత్వం మౌలిక ఆదేశాలు జారీచేసినప్పటికీ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సర్వే మాత్రం కానరావడం లేదు. అర్బన్, రూరల్ హెల్త్ సెంటర్‌లోపని చేసే ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ప్రతి డివిజన్లలో ఇంటింటికి వెళ్లి జ్వర బాధితులను గుర్తించి వారిని ప్రాథమిక ఆసుపత్రులకు తరలించాల్సి ఉండగా ఇప్పటి వరకు అలాంటి చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. దీంతో ఇంట్లో ఒకరికి జ్వరం సోకితే ఇంటిల్లిపాది మొత్తం జ్వరం, గున్యా, డెంగ్యూ భారిన పడుతున్నారు.

### పీసీసీ అధ్యక్షుడిని సన్మానించిన రామగుండం ఎమ్మెల్యే



మహేష్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, సెప్టెంబరు 15: కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ను ఆదివారం గాంధీభవన్‌లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, రామగుండం నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ ఘనంగా సన్మానించారు. బీసీ వర్గానికి చెందిన మహేష్‌గౌడ్‌కు పీసీసీ అధ్యక్షుడిగా నియమించినందుకు సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖార్గే, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

**పెద్దపల్లి (ఆంధ్రజ్యోతి) :** కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మహేష్‌గౌడ్‌ను ఆదివారం గాంధీ భవన్‌లో పెద్దపల్లి జిల్లా పక్షాన టీపీసీసీ ప్రచార కార్యదర్శి భూసనవేని రమేష్‌గౌడ్ ఘనంగా సన్మానించారు.









## నేడు గణనాథుల నిమజ్జనం

- ఖనిలో సింగరేణి, మున్సిపల్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు
- గణేష్ చౌక్‌లో గణనాథులకు స్వాగతం



విద్యుత్ కాంతుల్లో గోదావరిఖని ప్రధాన చౌరస్తా

కోల్‌సిటీ, సెప్టెంబరు 15: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సోమవారం గణేష్‌నిమజ్జనం జరుగనున్నది. గణపతి నిమజ్జనానికి సింగరేణి, మున్సిపల్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ నవరాత్రులకు ముందుగానే మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, పోలీస్, వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిమజ్జనానికి ఇబ్బంబదులు కలుగకుండా శాఖలవారీగా పనుల విభజన చేశారు. ఇందుకు అనుగుణంగా సింగరేణి, నగర పాలక సంస్థలు ఏర్పాట్లు చేస్తున్నాయి. నవరాత్రులు పూజలు అందుకున్న గణనాథులను సోమవారం గోదావరి వంతెన నుంచి నిమజ్జనం చేయనున్నారు. ఈ మేరకు గోదావరి వంతెన వద్ద వేదికలు ఏర్పాటు చేశారు. ఈ ప్లాట్‌ఫాంల నుంచి గోదావరిలో గణనాథులను నిమజ్జనం చేస్తారు. మొదట 20ప్లాట్‌ఫాంలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినా గోదావరిలో ప్రవాహం తక్కువగా ఉండడంతో 16 ప్లాట్‌ఫాంలను ఏర్పాటు చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు ఐదు గేట్లు ఎత్తి 14వేల క్యూసెక్కుల నీటిని కిందకు వదిలారు. గత ఏడాది 580 గణనాథులను ప్రతిష్టింగా ఈ సారి 600గణనాథులను ప్రతిష్టించారు. శోభయాత్ర దృష్ట్యా మున్సిపల్, సింగరేణిలు విస్తృత ఏర్పాట్లు చేశాయి. శోభయాత్ర జరిగే ప్రాంతాల్లోని రోడ్ల గుంతలను పూడ్చారు. సింగరేణి సంస్థ వివిధ కూడళ్లకు సీరిస్ లైట్లను అమర్చింది. గోదావరిఖని మెయిన్‌చౌరస్తాలో గణనాథులకు స్వాగతం పలుకనున్నాయి. మెయిన్ చౌరస్తాలోనే 300లైట్లతో లైటింగ్ ఏర్పాటుచేశారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా ఎక్స్‌ప్రెస్‌లైన్లను అమర్చారు. అనివార్య పరిస్థితులు ఏర్పడితే ఇబ్బంది కలుగకుండా 60కేవీఏ జనరేటర్ ఏర్పాటు చేశారు. గోదావరి వంతెన వద్ద లైటింగ్ ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడా ఎక్స్‌ప్రెస్ లైన్ ఏర్పాటుచేయడంతో పాటు 60కేవీఏ జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంతో పాటు శ్రీరాంపూర్, మందమర్రి, రామకృష్ణాపూర్ ప్రాంతాల నుంచి కూడా గణనాథులు వచ్చే అవకాశం ఉండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు. మంగళవారం తెల్లవారు వరకు నిమజ్జనం జరిగే అవకాశం ఉంది.

## డ్రోన్, సీసీ కెమెరాల నిఘాలో నిమజ్జనం

- గోదావరిఖనిలో శోభాయాత్ర రూట్‌మ్యాప్‌ను పరిశీలించిన సీపీ శ్రీనివాస్



గోదావరి వంతెనను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్



పెద్దపల్లిలో నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీ

కోల్‌సిటీ, సెప్టెంబరు 15: డ్రోన్లు, సీసీ నిఘాలో గణపతి నిమజ్జనం జరుగనున్నదని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. పెద్దపల్లి జోన్ పరిధిలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా, అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరుగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆదివారం గోదావరిఖని పట్టణంలో నిమజ్జనం జరిగే ప్రదేశాలు, శోభయాత్ర రూట్‌ను పెద్దపల్లి డీసీపీ చేతన, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన సమయంలో పోలీసుల సూచనలకు అనుగుణంగా నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు నడుచుకోవాలన్నారు. నిమజ్జన సందర్భంగా జిల్లాలోనివివిధ ప్రాంతాల్లో భారీ బందోబస్తు, పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. మొదటి సారిగా కమిషనరేట్‌పరిధిలో శోభాయాత్రపై డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తామన్నారు. ఉత్సవ కమిటీలు త్వరితగతిన పూజలు ముగించుకుని వెలుగుతు ఉండగానే విగ్రహాలను జాగ్రత్తగా నిమజ్జనం చేయాలన్నారు. నిమజ్జన ఊరేగింపు సమయంలో డీజేలు, బాణాసంచా కాల్చడం నిషేధమన్నారు. సీపీ ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, టుటౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు ఉన్నారు.

**మంథని :** ప్రశాంతంగా వినాయక నిమజ్జన ఉత్సవం ముగిసేలా పోలీసు శాఖ తరుపున పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు రామగుండం సీపీ ఎం. శ్రీనివాస్ తెలిపారు. పెద్దపల్లి డీసీపీ చేతన, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి సీపీ శ్రీనివాస్ మంథని గోదావరినది తీరాన్ని ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలీసు పికెటింగ్ తోపాటు ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో రోడ్ల రిపేర్, ఫ్లడ్ లైట్లు, క్రేన్స్, మంచినీరు వసతి ఏర్పాటు చేశామన్నారు. గజ ఈతగాళ్ళను సైతం అందుబాటులో ఉంచుతామన్నారు. వినాయక శోభయాత్రలను డ్రోన్ సీసీ కెమెరాల పర్యవేక్షణలో కొనసాగుతాయన్నారు. ఆయన వెంట ఎస్‌బీ ఏసీపీ రాఘవేందర్‌రావు, పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ రాజులు పాల్గొన్నారు.

**పెద్దపల్లిటౌన్ :** రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి జోన్ పెద్దపల్లి వివిధ ప్రాంతాల వద్ద నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, ఎలాంటి అవాంచనియా సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన భద్రత, బందోస్త్ ఏర్పాట్లు చేసినట్లు సీపీ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం పెద్దపల్లి పట్టణం మినీ ట్యాంక్ బండ్, సుల్తానాబాద్ పట్టణ కేంద్రం లోని చెరువు, మంథని పట్టణంలోని గోదావరి వద్ద, గోదావరిఖని గోదావరి బ్రిడ్జీ వద్ద నిమజ్జనం జరిగే ప్రదేశాలను, నిమజ్జన శోభయాత్ర జరిగే రూట్‌ను పోలీస్ కమీషనర్, డీసీపీ చేతన, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. సీపీ వెంట స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, మంథని సీఐ రాజు, ఇంద్రసేనరెడ్డి, ప్రసాద్‌రావు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**సుల్తానాబాద్ :** గణపతి నవరాత్రులను ముగించుకోని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్ పరిధిలోని ప్రాంతాల వద్ద నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలోని గణనాధులను నిమజ్జనం చేసే పెద్దచెరువును సీపీ పరిశీలించారు. వెంట పెద్దపల్లి డీపీసీ చేతన, ఏపీసీ గజ్జి కృష్ణ, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ-రాజమల్లు, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్‌కుమార్, ఏఎస్ఐ తిరుపతి, మున్సిపల్ మేనేజర్ అలీం, ఏఈఈ శంకరయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.





**సాయి PVT ITI- జగిత్యాల**

★ సాయి PVT. ITI జగిత్యాల Hurry up... కొద్ది సీట్లు మాత్రమే కలవు, 10వ తరగతి ఉత్తీర్ణులైనవారికి చివరి అవకాశముగా ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్, సివిల్ & మెకానిక్ డీజిల్ ట్రేడ్స్‌లో చేరుటకు అడ్మిషన్లు జరుగుచున్నవి. సంప్రదించండి: సెల్: 81063 71128

AJK-201578

**కావలెను**

NGOలో ప్రతి గ్రామ పంచాయతిలలో మరియు మున్సిపాలిటిలలోని వార్డులలో వాలంటీర్స్‌గా పనిచేయుటకు ఆసక్తి గలవారు 25 నుండి 35 వయస్సు కలవారు డిగ్రీ ఆపైన చదివిన వారు కావలెను. గౌరవవేతనం 30K-45K వరకు సంప్ర: 9545350519

AJK-201609

**CHANGE OF NAME**

I, MOHAMMED MAZHARUDDIN S/o. MOHAMMED HASEEBUDDIN, H.No: R/o 5-1-33/C, Osmanpura, Jagtial Town & District. Telangana-505327. shall henceforth be known as MOHAMMAD MAZHARUDDIN S/O. MOHAMMAD HASIB UDDIN.

AJK-201583

**3+2 స్కీం కలదు**

**WANTED**

★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను / పేషెంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 25K. క్వాలిఫికేషన్ : ఏదీ డిగ్రీ. ఫోన్ : 8977547749

AJH-002661

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

**ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి**

కరీంనగర్ :- సెల్ : 9703618691, 9985410640
జగిత్యాల :- సెల్ : 99854 11262
మెట్‌పల్లి :- సెల్ : 70131 42966
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063
పెద్దపల్లి :- 95509 00238

## 'నవోదయ'లో కళోత్సవాలు ప్రారంభం

● వివిధ జిల్లాల నుంచి విద్యార్థుల రాక



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ మంగతాయారు

చొప్పదండి, సెప్టెంబరు 15: జవహర్ నవోదయ విద్యాలయంలో కళోత్సవాలు 2024 ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను ప్రిన్సిపాల్ మంగతాయారు, రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ దాస్యం సేనాధిపతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్లస్టర్ స్థాయిలోని 9 జిల్లాల నవోదయ విద్యాలయాల నుంచి విద్యార్థులు ఈ ఉత్సవాలకు హాజరుకాగా వివిధ పోటీలో పాల్గొన్నారు. ఆదివారం ఆదిలాబాద్, రంగారెడ్డి, మెదక్, వరంగల్ విద్యాలయాల విద్యార్థులు పాటలు, చిత్రలేఖనం, నృత్యం పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కేబీ శర్మ, కట్ట మంజుల, సత్యనారాయణ, రాధాకృష్ణ వ్యవహరించారు. కాగా ఉత్సవాలు రెండురోజుల పాటు జరుగనున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గల్ఫ్ కుటుంబాలకు ప్రాధాన్యమివ్వాలి

### ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 15: విదేశాల్లో ఉపాధి పొందుతూ, తెలంగాణ ఖజానాకు ఆదాయం సమకూర్చుతున్న గల్ఫ్ కుటుంబా లకు ప్రభుత్వం అండగా నిలిచి, సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. సుమారు 15లక్షల కుటుంబాలకు పైగా గల్ఫ్ దేశాలలో ఉపాధిని పొందు తున్నారన్నారు. సగటున ఒక్కో కుటుంబానికి నెలకు రూ.10వేల వేతనం పొదుపుగా భావించిన నెలకు రూ.1500 కోట్ల విదేశీమారక ద్రవ్యం సమకూర్చబడుతుందన్నారు. ఇదే లెక్కన ఏడాదికి 18వేల కోట్లు, గడిచిన పదేళ్ల తెలంగాణ పాలనలో సుమారు లక్ష80వేల కోట్ల ఆదాయం చేకూరిందనేది స్పష్టమవు తుందన్నారు. ఇందులో నుంచి ఏ మార్గం ద్వారా ఖర్చు పెట్టిన కనీసం 10శాతం అమ్మకపన్నుద్వారా సుమారు 18వేల కోట్లు ఆదాయం గల్ఫ్ కుటుంబాలద్వారా వచ్చిందని భావించక తప్పదన్నారు. ఇంత ఆదాయం రాష్ట్రానికి ఒనగూర్చిపెడుతున్న తెలంగాణ గల్ఫ్ బిడ్డలకు కనీసం ఒక్కపైసా లాభం ఒనగూర్చకపోవడం దురదృష్టకరం అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్న బిడ్డలు దురదృష్టవశాత్తు గల్ఫ్‌లో మరణిస్తే వారికి కుటుంబాలకు రూ.5లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు, విదేశాల నుంచి తిరిగి వచ్చిన కార్మికులకు స్వదేశంలో స్థిరపడేందుకు స్వయం ఉపాధి పథకాల్లో ప్రాధాన్యత, వారి పిల్లలకు గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రాధాన్యత, గృహవసతి కల్పించడం ప్రభుత్వం బాధ్యతగా భావించాలన్నారు. వీటితో పాటు కేరళ రాష్ట్ర తరహాలో కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు.

## మత్స్యకారుడి వలకు చిక్కిన కొండచిలువ

గన్నేరువరం, సెప్టెంబరు 15 : మండల కేంద్రానికి చెందిన మత్స్యకారుడు రంగనవేణి రాజేశం ఆదివారం లోయర్ మానేరు డ్యాంలో చేపలు పట్టేందుకు వెళ్ళగా అతడు వేసిన వలకు భారీ కొండచిలువ చిక్కింది. వలకు చిక్కిన కొండచిలువ సుమారు మూడు మీటర్ల పొడవు ఉండడంతో తోటి మత్స్యకారుల సాయంతో బయటకు లాగారు. ఒడ్డుకు తీసుకెళ్లిన కొద్దిసేపటికే కొండచిలువ మృతి చెందినట్లు వారు తెలిపారు.
































# వస్తోంది.. 'వందేభారత్'



- నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు నడవనున్న రైలు
- నేడు నాగ్‌పూర్‌లో ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- రాష్ట్రంలో రామగుండం, కాజీపేటలో మాత్రమే హాల్టింగ్ సౌకర్యం
- వారంలో మంగళవారం మినహా ఆరు రోజులు నడవనున్న రైలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

దేశంలోనే అత్యంత వేగంగా నడిచే రైలుగా పేరొందిన వందే భారత్ రైలు నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్ వరకు నడవనున్నది. ఇప్పటివరకు రాష్ట్రంలో వందే భారత్ రైళ్లు విశాఖపట్నం-సికింద్రాబాద్, కాచిగూడ-తిరుపతి మధ్య నడుస్తున్నాయి. నాగ్‌పూర్-సికింద్రాబాద్‌కు నడిచే వందే భారత్ రైలును భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 16వ తేదీన గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో వర్చువల్‌గా సాయంత్రం 4.15 నిమిషాలకు పచ్చజెండా ఊపి ప్రారంభించనున్నారు. దీంతో పాటు అదేరోజు పూణె-హుబ్లీ, కోలాపూర్-పూణె వరకు కూడా మరో రెండు వందేభారత్ రైళ్లను ప్రారంభించనున్నారు. నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు నడవనున్న వందే భారత్ రైలుకు తెలంగాణలో పెద్దపల్లి జిల్లా రామగుండంతో పాటు వరంగల్ జిల్లా ఖాజీపేటలో ఆగనున్నది. వారంలో మంగళవారం మినహా అన్ని రోజుల్లో నడవనున్నది. ఈ రైలు 20 కోచులతో గంటకు 130కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనున్నది. రామగుండం నుంచి సికింద్రాబాద్‌కు 3 గంటల్లోనే చేరుకోనున్నారు. ఈ రైలును సోమవారం నాగ్‌పూర్‌లో ప్రారంభించిన తర్వాత రాత్రి 19:30 గంటలకు రామగుండం చేరుకోనున్నది. అక్కడ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ స్వాగతం పలకనున్నారు. రెగ్యులర్‌గా ట్రైన్ నంబర్ 20101 నాగ్‌పూర్‌లో ఉదయం 5:43 గంటలకు బయలుదేరనున్నది. సేవగ్రామ్‌కు, 7:03 గంటలకు చంద్రాపూర్‌కు, 7:20 గంటలకు బల్లార్షకు చేరుకుంటుంది. అక్కడి నుంచి రామగుండంకు 9:08 గంటలకు చేరుకుని 9:10 గంటలకు బయలు దేరుతుంది. 10:04 గంటలకు ఖాజీపేటకు, మధ్యాహ్నం 12:15 గంటలకు సికింద్రాబాద్ చేరుకోనున్నది. తిరిగి ట్రెయిన్ నంబర్ 20102 సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 13:00 గంటలకు బయలుదేరి ఖాజీపేటకు 14:18 గంటలకు, రామగుండంకు 15:13 గంటలకు, బల్లార్షాకు 17:25 గంటలకు, చంద్రాపూర్‌కు 17:40 గంటలకు, సేవగ్రామ్‌కు రాత్రి 19:13 గంటలకు, నాగ్‌పూర్‌కు 20:20 గంటలకు చేరుకోనున్నది.

### ● అక్టోబరు 23 నుంచి వారాంతపు ప్రత్యేక రైళ్లు..

ప్రయాణికుల సౌకర్యార్థం మధ్య రైల్వే జోన్ పూణె డివిజన్ అధికారులు వారాంతపు ప్రత్యేక రైళ్లు(పూణె నుంచి కరీంనగర్ వరకు) నడపనున్నారు. ఈ ప్రత్యేక రైళ్లు వచ్చే నెల 23వ తేదీ నుంచి పూణె రైల్వే స్టేషన్‌నుంచి ప్రారం భం అవుతాయి. ఈ ప్రత్యేక రైళ్లు ఎగువ మార్గంలో 4 ట్రిప్‌లు, దిగువ మార్గంలో 4ట్రిప్‌లు నడుస్తాయి. రైలు సంఖ్య 01451 పూణె నుంచి కరీంనగర్ వారంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు దిగువ మార్గంలో అక్టోబర్ 21, 28, నవంబరు 4, 11 తేదీల్లో సోమవారం రాత్రి 10:45 నిమిషాలకు పూణె రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి బుధవారం అక్టోబరు 23, 30 నవంబరు 6, 13 తేదీల్లో తెల్లవారు జా మున 2:00 గంటలకు కరీంనగర్ రైల్వేస్టేషన్ చేరుకుంటుంది. ఈ రైలు ప్రయాణ సమయం 27గంటల 15 నిమిషాలు, వీటిని 4 ట్రిప్పులు నడపనున్నారు. రైలు సంఖ్య 01452 కరీంనగర్ నుంచి పూణె వారాంతపు ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు ఎగువ మార్గంలో అక్టోబర్ 23, 30 నవంబర్ 6, 13వ తేదీల్లో బుధవారం ఉదయం కరీంనగర్ రైల్వే స్టేషన్ నుంచి 6 గంటలకు బయలుదేరి మరుసటిరోజు గురువారం ఉదయం 9:45 గంటలకు అక్టోబరు 24, 31 నవంబరు 7, 14 తేదీల్లో పూణె రైల్వే స్టేషన్ చేరుకుం టుంది. ఈ రైలు ప్రయాణ సమయం 29గంటల 45 నిమిషాలు. అలాగే ఉమ్మడి ఆదిలాబాదు జిల్లాలోని మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రజలకు ఈ రైలుద్వారా ఉదయం ఆదిలాబాదు వెళ్లడానికి ఎంతో ఉపయో గంగా ఉంటుంది. కరీంనగర్-పూణె-కరీంనగర్ ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు వలన ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాదు జిల్లా కేంద్రాలు అనుసంధానం కానున్నాయి. ఈ రైలు పెద్దపల్లి జంక్షన్, బల్లార్ష జంక్షన్, మాజ్రీ కాదన్, ఆదిలాబాదు, ముద్ఖేడ్, నాందేడ్, పూర్ణా, పర్బని, ఔరం గాబాద్, మన్మాడ్, అహ్మద్‌నగర్, దౌండ్ మీదుగా నడవనున్నది. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాదు జిల్లాలోని మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రజలకు ఆదిలాబాదు వెళ్లడానికి రోడ్డు మార్గం తప్ప రైలు సౌకర్యం అందుబాటులో లేవు. ఈ రైలు అందుబాటులోకి వచ్చిన తరువాత చాలామంది దీనిద్వారా ఆదిలాబాదు ప్రయాణించే వీలుంటుంది. అలాగే ఈ రైలు ఐటీ పరంగా ఎంతో అభివృద్ధి చెందిన పూణె నగరాన్ని ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాదు జిల్లాల ప్రజల్ని అనుసంధానం చేయనున్నది. అలాగే ఈ పూణె వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా మహారాష్ట్రలోని ప్రముఖ దేవాలయాలు సందర్శించడానికి వీలుగా ఉంటుంది, చంద్రపూర్ (చాందా) మహంకాళి ఆలయం, కిన్వ ట్ రైల్వేస్టేషన్‌కి దగ్గర్లో ఉన్న మహూర్ శక్తిపీఠం (రేణుకాఎల్లమ్మ) ఆలయం, నాందేడ్‌లోని సిక్కుల పవిత్ర గురుద్వారా, ఔరంగాబాద్ (ఛత్రపతి శంబాజీనగర్)లోని అజంతా, ఎల్లోరా గుహలతో పాటు ప్రముఖ గృశ్నేశ్వర్ జ్యోతిర్లింగం, కోపర్‌గావ్ రైల్వేస్టేషన్ దగ్గర్లోని శిరిడీ సాయిబాబా దేవాలయంతో పాటు పూణెలోని వినాయకుని ఆలయాలు సందర్శించుకునే అవకాశాలున్నాయి. కరీంనగర్ నుంచి పూణె 01452 వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు అక్టోబరు 23, 30 నవంబరు 6, 13వ తేదీల్లో బుధవారం ఉదయం పెద్దపల్లి జంక్షన్ 6:45 గంటలకు వస్తుంది. ఈ రైళ్లకు పెద్దపల్లి జంక్షన్, రామగుండం, మంచిర్యాల, సిర్పూర్‌కాగజ్‌నగర్, ఆదిలాబాదు రైల్వేస్టేషన్‌లలో స్టాప్ సదుపాయం కల్పించారు. పూణెనుంచి వచ్చే టప్పుడు ఈ రైలు పెద్దపల్లి జంక్షన్‌కి బుధవారం రాత్రి 12:08 గంటలకు వస్తుంది. ఈ రైళ్లను సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు కోరుతున్నారు.

### ● చార్జీల వివరాలు..

సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్‌కు నడనున్న వందేభారత్ రైలు నంబర్ 20102లో కోచ్‌లను బట్టి చార్జీలను వసూలు చేయనున్నారు. సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ వరకు చైర్‌కార్‌లో రూ.925 (ఆహా రం కలిపి), రూ. 885(ఆహారం లేకుండా), ఎగ్జి క్యూటివ్ క్లాస్‌లో రూ.1510 (ఆహారంతో కలిపి), రూ. 1305 (ఆహారం లేకుండా) చార్జీలు తీసుకోనున్నారు. సికింద్రాబాద్ నుంచి రామగుండంకు చైర్ కార్‌లో రూ.670 (ఆహారం లేకుండా), రూ.865 (ఆహారంతో కలిపి), ఎగ్జిక్యూటివ్‌క్లాస్‌లో రూ. 1510 (ఆహారంతో కలిపి), రూ.1305 (ఆహారం లేకుండా) చార్జీలు తీసుకోనున్నారు. ఈ రైలులు ఎటువంటి రాయితీలు వర్తించవు. వికలాంగుల కోటా, సీనియర్ సిటిజన్‌ల, ఇతరత్రా ఎవరికి కూడా రాయితీలు ఉండవని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

# ప్రాణం తీసిన అతివేగం

- ద్విచక్ర వాహనాలను ఢీకొన్న ప్రైవేట్ బస్సు
- బైక్‌ని 150 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లడంతో.. తాత, మనువరాలు దుర్మరణం
- మనవడి పరిస్థితి విషమం
- అల్లీపూర్, ధర్మపురిలో తీవ్ర విషాదం


నారవేణి శ్రీనిధి (ఫైల్)


బైండ్ల లచ్చన్న (ఫైల్)

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 15 : ఓ ప్రైవేటు బస్సు అతివేగం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఉత్సాహంగా గణేష్ నిమజ్జన వేడుకలు చూసేందుకు వెళ్తూ తాత, మనుమరాలు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. జగిత్యాలరూరల్ మండలంలోని పొలాసలో ఆదివారం ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. జగిత్యాల-ధర్మపురి జాతీయ రహదారిపై జగిత్యాలరూరల్ మండలంలోని పొలాస స్టేజీవద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆగిఉన్న ఆర్టీసీ బస్సు ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో అతివేగంగా రెండు ద్విచక్ర వా హనాలను ఢీకొట్టింది. ఈఘటనలో రాయికల్ మండ లం అల్లీపూర్‌కు చెందిన బైండ్ల లచ్చన్న (52) ధర్మపురి పట్టణానికి చెందిన నారవేణి శ్రీనిధి (09) అక్కడికక్కడే మృతి చెందారు. జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామా నికి చెందిన బైండ్ల లచ్చన్న కూతురు మమత ధర్మపురిలో ఉంటున్నారు. అల్లీపూర్‌లో జరుగుతున్న గణేష్ నిమజ్జన వేడుకలను పిల్లలకు చూపించాలని కూతురి కోరిక మేరకు ధర్మపురి నుంచి అల్లీపూర్‌కు మనుమడు, మనుమరాలును తీసుకొని ద్విచక్రవాహనంపై బయల్దేరారు. మార్గమధ్యలోని జగిత్యాలరూరల్ మండలం పొలాస వద్దకు చేరుకోగానే వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని కొండగట్టు నుంచి ధర్మపురి వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు నంబర్ (టీఎస్ 21 యూడీ 9955) అతి వేగంగా ఓవర్‌టేక్ చేసి బలంగా ఢీకొట్టింది. దీంతో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని బస్సు 150మీటర్ల మేర ఈడ్చుకెళ్లడంతో శ్రీనిధి, లచ్చన్న అక్కడి కక్కడే మృతి చెందారు. మృతదేహాలు నుజ్జునుజ్జై రహదారిపై చెల్లాచెరుదుగా పడిఉన్నాయి. మల్లి కార్జున్‌కు తీవ్ర గాయాల వడంతో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదే ఘటనలో జగిత్యాలరూరల్ మండలం పొలాసకు చెందిన బూర్ల రాజన్న, బద్దెనపల్లి నర్సయ్యలు ప్రయాణిస్తున్న స్కూటీని సైతం బస్సు ఢీకొట్టడంతో తీవ్రగాయాలై జగిత్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సధాకర్ పరిశీలించారు. నారవేణి మమత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు.

### అతివేగం.. నిర్లక్ష్యం

జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస స్టేజీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదానికి అతి వేగమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొండగట్టు వైపు నుంచి ధర్మపురి వైపు అతివేగంగా వస్తున్న ప్రైవేట్ బస్సు పొలాస స్టేజీ వద్ద ఆగిఉన్న ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేసే క్రమంలో ధర్మపురి నుంచి జగిత్యాల వైపు వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని వారు సంఘటన స్థలంలో చర్చించు కున్నారు. కొంత తక్కువ వేగంగా ఉంటే ప్రమాద తీవ్రత తగ్గి ఉండేదని స్థానికులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యులు సంఘటన స్థలంలో రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతితో రాయికల్ మండలం అల్లీపూర్, ధర్మపురిలో తీవ్రవిషాదం చోటుచేసుకుంది.

## శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



జగిత్యాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం ఇన్‌ఫ్లో కొనసాగింది. ఎస్సారెస్పీలోకి 25,840 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 25,840 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

## క్రైం కార్నర్

### వ్యక్తి రిమాండ్

హుజూరాబాద్, సెప్టెంబరు 15: హుజూరాబాద్‌లో ఓ యూట్యూబ్ ఛానల్‌కు చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన పి సమ్మయ్య అనే వ్యక్తి భూపాల్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. జూలై నెలలో హుజూరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారిని టి సంపత్ అనే వ్యక్తి డబ్బులు అడిగినట్లు యూట్యూబ్ ఛానల్ వ్యక్తి సమ్మయ్య ఆడియో సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. దీంతో సదరు సంపత్ తనకు సంబంధం లేదని, తాను ఎవరిని డబ్బులు అడగలేదని హుజూరాబాద్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. యూట్యూబ్ ఛానల్‌కు చెందిన సమ్మయ్య అనే వ్యక్తి వేరే వ్యక్తి జగన్‌తో కావా లనే చేశాడని తేలింది. సమ్మయ్యను హుజూరాబాద్ డిపో క్రాస్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి నట్లు తెలిపారు. గతంలో సమ్మయ్యపై భూపాల్‌పల్లిలో రౌడీషీట్‌తో పాటు ఐదు కేసులు ఉన్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

### జ్వరంతో మహిళ మృతి


లక్ష్మి(ఫైల్)

ముత్తారం, సెప్టెంబరు 15 : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పోతారం గ్రామంలో గుజ్జుల లక్ష్మి(52) జ్వరంతో మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మి నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఆమెను కొడుకు రాజ్‌కుమార్ ఆదివారం 108 అంబులెన్స్‌లో పెద్దపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. లక్ష్మి భర్త నాలుగేళ్ల క్రితం మృతి చెందగా, తన కొడుకుతో కలిసి పోతారం గ్రామం లో కూలి పని చేసుకుంటూ జీవిస్తోంది.

### పోలీసుల పేరు చెప్పి బైక్‌తో ఉడాయింపు

#### కరీంనగర్‌లో సినీ ఫక్కీలో చోరీ

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 15: పోలీసుల పేరు చెప్పి శనివారం రాత్రి యువకుడి వద్ద ద్విచక్రవాహనం తీసుకుని ఓ దొంగ ఉడాయిం చాడు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం కరీంనగర్ తిలక్‌రోడ్‌కు చెందిన బొజ్జ శివ బీటెక్ పూర్తి చేసి ఇంటివద్దనే ఉంటు న్నాడు. బొజ్జ శివ శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో తన రాయల్ ఎన్‌ఫీల్డ్(టీఎస్ 02 ఇఎక్స్ 7852) బైక్‌పై పని కోసం బయటకు వచ్చాడు. శివ శాస్త్రీరోడ్ ఒక మెడికల్ షాపు వద్దకు వచ్చేసరికి ట్రాఫిక్ పోలీసు వేషధారణ లో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి తాను ట్రాఫిక్ పోలీసునంటూ పరిచయం చేసుకున్నాడు. మా ఎస్ఐని తీసుకొని వస్తానని చెప్పి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ తీసుకెళ్లాడు. ఆ వ్యక్తి ఎంతకీ రాక పోయేసరికి తాను మోసపోయానని శివ గ్రహించాడు. బైక్ కోసం రాత్రంతా వెతికిన శివ ఆదివారం ఒకటో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. శాస్త్రీరోడ్‌లోని సీసీ కెమెరాలను క్రైంపార్టీ పోలీసులు పరిశీలించి, నిందితుడి కోసం గాలిస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గన్నేరువరం, సెప్టెంబరు 15 : మండలంలోని గుండ్లపల్లి స్టేజీ రాజీవ్ రహదారిపై వెళుతున్న బైకును వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న టీఎస్ 36జె1895 బైకును వెనక నుంచి టీఎస్ 28జె8868 కారు ఢీకొట్టింది. దీంతో బైక్ మీద ఉన్న ఇద్దరు ఎగిరిపడడంతో ఒకరికి కాలు విరగగా, మరొకరికి భుజానికి గాయం అయింది. స్థానికులు టోల్‌గేట్ అంబులెన్స్‌లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తులు హుజూరాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఉమాపతిరెడ్డి, సుభాష్ రెడ్డిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.


మిడ్ మానేరు ప్రాజెక్ట్

## నిండుకుండలా మిడ్ మానేరు

బోయినపల్లి, సెప్టెంబరు 14: శ్రీరాజరాజేశ్వర జలాశయం (మిడ్ మానేరు) నిండు కుండలా మారింది. మేడిగడ్డ ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలు లేకపోవడంతో ఈ ఏడాది మిడ్ మానేరు పూర్తిస్థాయిలో నిండుతుందా? అనే సందేహం తలెత్తింది. అయితే ఎల్లంపల్లి, ఎస్సారెస్పీ నుంచి వరద నీరు వచ్చి చేరడంతో జలకళను సంతరించుకుంది. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఆదివారం ఉదయం వరకు మిడ్ మానేరులోకి 48.859 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా ఇందులో శ్రీపాద ఎల్లంపల్లి ఎత్తిపోతల ద్వారా 23.978 టీఎంసీలు, ఎస్సారెస్పీ నుంచి 12.376, ప్రాజెక్టు ఎగువ భాగాన కురిసిన వర్షాలతో మానేరు, మూలవాగు ద్వారా 12505 టీఎంసీల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. మిడ్ మానేరు నుంచి ఎల్ఎండీ ప్రాజెక్టుకు 10.127 టీఎంసీలు, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 17.534 టీఎంసీలు కుడి కాలువకు 0.079 మిషన్ భగీరథక, నీటి ఆవిరి కింద 0.813 టీఎంసీలు తరలివెళ్లాయి. దీంతో మిడ్ మానేరుపై ఆధారపడిన ప్రాజెక్టులకు నీటి కష్టాలు తప్పడంతో ప్రాజెక్టుపై ఆధారపడిన పంట భూములకు వానాకాలం, యాసంగి సాగుకు ఢోకా లేకుండా పోయింది. మిడ్ మానేరు పూర్తి స్థాయి నీటి మట్టం 318. మీటర్లకు ప్రస్తుతం 317.47కు చేరుకుంది. నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు 26.19 టీఎంసీలకు చేరుకుంది.

## ధర్మగుండంలో గణపయ్య నిమజ్జనం


ధర్మగుండంలో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న అర్చకులు, సిబ్బంది

వేములవాడ, సెప్టెంబరు 15 : గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు అందుకున్న ఆది దేవుడు విగ్నేశ్వరుడి నిమజ్జనోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల కోసం రాజన్న ఆలయ ఆవరణలోని నాగిరెడ్డి మండపంలో ప్రతిష్టించిన విఘ్నేశ్వరుడికి ఆలయ అర్చకులు ప్రతీరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేకపూజలు చేశారు. చివరి రోజైన ఆదివారం ఉదయం ఆలయ అర్చకులు, వేద పండితులు హవనము నిర్వహించి పూర్ణాహుతి, రాత్రి ప్రత్యేక పూజల తదుపరి పట్టణ వీధుల మీదుగా గణేశుడి శోభాయాత్ర కన్నుల పండు వగా నిర్వహించారు. ధర్మగుండంలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వినోద్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఆలయ అధికారులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

### పట్టపగలే ఇంట్లోకి దూరి దొంగతనం

తంగళ్లపల్లి, సెప్టెంబరు 15 : తంగళ్లపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఆదివారం ఓ దుండగుడు పట్టపగలే ఇంట్లోకి దూరి వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు ఎత్తుకెళ్లాడు. బాధితురాలి వివరాల ప్రకారం.. తంగళ్లపల్లికి చెందిన సబ్బని రుక్కుమ్‌బాయి అనే వృద్ధురాలు ఆదివారం ఉదయం ఇంట్లో వంట చేసుకుంటోంది. దుండగుడు ఇంట్లోకి దూరి ఒంటిపై ఉన్న బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. వృద్ధురాలు అరుస్తూ ఇంటి బయటకు రాగా పక్కనే వినాయక మండపం వద్ద ఉన్న యువకులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే దొంగ ద్విచక్ర వాహనంపై పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. సుమారు రెండున్నర తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లి నట్లు బాధితురాలు తెలిపింది. రుక్కుమ్‌బాయి భర్త, కుమారుడు మృతి చెందగా ఒక్కతే ఉంటోంది. ఇది గమనించి పథకం ప్రకారం ఇంట్లోకి దూరి గొలుసు ఎత్తుకెళ్లినట్లు స్థానికులు భావిస్తున్నారు. ఎస్సై సుధాకర్ బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. పట్టపగలు చోరీ జరగడంతో పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దొంగ కోసం గాలిస్తున్నామని తెలిపారు.


బాధితురాలు సబ్బని రుక్కుమ్ బాయితో మాట్లాడుతున్న పోలీసులు

### వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 15: వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం పెద్దపల్లిలో చోటు చేసుకుంది. శాంతినగర్‌కు చెందిన మోహన్‌రెడ్డి(58) ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్తుండగా గోదావరిఖని నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కోళ్లవ్యాన్ ఢీకొట్టింది. మోహన్‌రెడ్డికి తీవ్రగాయాలు కాగా, పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. భార్య శివపార్వతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. యాక్సిడెంటు చేసిన డ్రైవర్ గోలి రతన్ పోలీసులకు లొంగిపోయాడు.

### పురుగుల మందు తాగి..

జూలపల్లి, సెప్టెంబరు 15 : మండల కేంద్రానికి చెందిన కల్లెం తిరుపతిరెడ్డి(45) జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతిరెడ్డికి పిల్లలు లేరు. రెండేళ్ల క్రితం భార్య అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి ఆయన మానసికంగా కృంగిపోయి పిచ్చిగా ప్రవర్తించేవాడని, ఈక్రమంలో మృతుడి తండ్రి రాజిరెడ్డికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో తల్లి కరీంనగర్ ఆసు పత్రికి తీసుకపోయి వైద్యం కోసం అక్కడనే ఉంటున్నారు. దీంతో జూలపల్లిలో ఇంటివద్ద ఒంటరిగా ఉన్న తిరుపతిరెడ్డి జీవితంపై విరక్తిచెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసున్నాడు. మృతుడి తల్లి నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# సమస్యల వలయంలో గుండ్లపల్లి గురుకుల పాఠశాల



గుండ్లపల్లిలోని మహాత్మా జ్యోతిబాఫూలే బాలికల గురుకుల పాఠశాల

గన్నేరువరం, సెప్టెంబరు 15: మండలంలోని గుండ్లపల్లి స్టేజీ వద్ద నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతి బాఫూలే బాలికల గురుకుల పాఠశాలలో అసౌకర్యాలు వెక్కిరిస్తున్నాయి. పాఠశాలలకు వరుస సెలవులు ఇవ్వడంతో విద్యార్థినులను ఇంటికి తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు ఆదివారం హాస్టల్‌కు వచ్చారు. హాస్టల్లో విద్యార్థినులు పడుతున్న అవస్థలను పరిశీలించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ హాస్టల్ ఆవరణలో మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాత్‌రూములకు డోర్లు కూడా ఊడిపోయి కనిపించడంతో హాస్టల్ నిర్వహణపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్‌తో సహా ఏ ఒక్క టీచరు హాస్టల్‌లో లేరన్నారు. ప్రిన్సిపాల్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాఠశాల గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

### హాస్టల్‌ను మానకొండూరుకు మారుస్తాం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గుండ్లపల్లి స్టేజీ వద్ద కొనసాగుతున్న మహాత్మా జ్యోతిబాఫూలే బాలికల గురుకుల పాఠశాలను ఇటీవల స్వయంగా తనిఖీ చేశాను. హాస్టల్‌లోని విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నాను. హాస్టల్‌లో ప్రధానంగా మురుగు నీటి సమస్య ఉందని గుర్తించి ప్రిన్సిపాల్‌ను వివరణ కోరాను. మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేదని, హాస్టల్ భవనం అసౌకర్యంగా ఉందని తెలిపారు. బిల్డింగ్ యజమానితో ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని తెలపారు. దీంతో హాస్టల్‌ను మానకొండూరుకు తరలించేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లాను. త్వరలోనే మానకొండూరులోని జూనియర్ కాలేజీకి హాస్టల్‌ను మారుస్తాము.

# ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు


గోదావరిఖనిలో ఇంజనీర్లను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు


విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్జీ-2 జీఎం


కమాన్‌పూర్‌లో ఇంజనీర్లకు సన్మానం..

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 15: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆదివారం రామగుండం లయన్స్‌క్లబ్ అధ్యక్షులు పీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, జైపూర్ పవర్‌ప్లాంట్ జీఎం ఎన్‌కే రాజశేఖర్ హాజరై మాట్లాడారు. ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమని అన్నారు. లలిత్‌కుమార్, రాజశేఖర్‌తో పాటు ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, మినేష్ నారాయణ ఠండన్‌ను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. లయన్స్‌క్లబ్ సభ్యులు ప్రమోద్‌కుమార్‌రెడ్డి, ఎల్లప్ప, గోవర్ధన్‌రెడ్డి, రాజేందర్, రామస్వామి, తిలక్‌చక్రవర్తి, శరత్‌బాబు, ఆంజనేయులు, మనోజ్‌కుమార్, లక్ష్మారెడ్డి, సారయ్య, సుధాకర్, సత్యనారాయణ, వెంకటేశం, బేణిగోపాల్‌త్రివేది, లక్కం బిక్షపతి, కోలేటి శ్రీనివాస్, తిరుపతి, రంగమ్మ పాల్గొన్నారు.

**యైటింక్లయిన్‌కాలనీ :** ఆర్జీ-2 ఏరియాలో ఆదివారం ఇంజనీర్స్ డే నిర్వహించారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జీఎం సూర్యనారాయణ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డీజీఎం (పర్సనల్) అనిల్‌కుమార్, అధికారులు వినయ్ సాగర్, ప్రతాపగిరి రాజు, మురళీకృష్ణ పాల్గొన్నారు. కాగా, ఓసీపీ-1లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని వేడుకలను ఆదివారం ఓసీపీ-1 ప్రాజెక్టులో అధికారులు ఘనంగా జరుపుకున్నారు. ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మేనేజర్ ఉదయ్ హరిజన్, అధికారులు కాశీ విశ్వేశ్వరరావు, ఉదయ్‌భాస్కర్, జ్ఞానేశ్వర్, సత్యనారాయణ, నజీర్ అహ్మద్, శ్రీనివాసరావు, సునీల్‌ప్రసాద్, సాయికృష్ణతో పాటు మైనింగ్, ఈఅండ్ఎం అధికారులు పాల్గొన్నారు.

**ధర్మారం :** ధర్మారంలో ఆదివారం ఇంజనీర్స్ డే వేడుకలను అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ధర్మారం సబ్ స్టేషన్‌లో సబ్ ఇంజనీర్ అనిల్‌ను వారు ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు మామిడిశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎలిగేటి మహేందర్, ఉపాధ్యక్షులు కందుల సతీష్, భైరి చంద్రమౌళి, ఎండి బాబా, బెక్కం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**ఎలిగేడు :** మండలంలో సుల్తాన్‌పూర్‌పూర్ గ్రామపంచాయతీలో ఇంజనీర్స్ డే వేడుకలు నిర్వహించారు. పంచాయతీరాజ్ ఏఈ పెండోట జగదీష్ బాబుకు ఘనంగా సన్మానం చేశారు. మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గర్రెపల్లి సురేందర్, సీఎస్‌సీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ స్రవంతిమోహన్‌రావు, మాజీ జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుకరాజనర్సు, జూలపల్లి ఎంపీవో అనిల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**సుల్తానాబాద్ :** లయన్స్ క్లబ్ ఆఫ్ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని స్థానిక విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ రంగు శంకరయ్యకు క్లబ్ సభ్యులు సత్కరించారు. క్లబ్ అధ్యక్షులు మాటేటి సంజీవ్ కుమార్, జిల్లా చీఫ్ కో-ఆర్డినేటర్ వలస నీలయ్య, జిల్లా కో-ఆర్డినేటర్లు మాటేటి శ్రీనివాస్, జూలూరి అశోక్ సభ్యులు తమ్మనవేణి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

**కమాన్‌పూర్ :** దేశానికి దిక్సూచిలు ఇంజనీర్లని కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఆదర్శనగర్‌లోని సాన గార్డెన్‌లో ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం సింగరేణి ఇంజనీర్లను సన్మానించారు. ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు మచ్చగిరి రాము, బండ సాయిశంకర్, జబ్బర్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

**రామగిరి :** ఇంజనీర్స్ డే ను పురస్కరించుకొని ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆర్జీ-3 సివిల్ ఇంజనీర్ ఎన్ రామకృష్ణను ఘనంగా సత్కరించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మోల్మామూరిశ్రీనివాస్, లయన్ గంట వెంకటరమణరెడ్డి, డాక్టర్ శరణ్య మారుతి, నాయకులు కాటంసత్యం, కళాధర్ రెడ్డి, తీగల శ్రీధర్, గుండం రవి, సాగర్, మధు, సంజీవ్, పాల్గొన్నారు.


ఎలిగేడులో ఏఈకి సన్మానం..


సుల్తానాబాద్‌లో సహాయ ఇంజనీర్‌కు సన్మానం

## టీయూఎఫ్ మండల కార్యవర్గం

ఎలిగేడు, సెపెంబరు 15 : మండల కేంద్రంలోని శివాలయంలో టీయూఎఫ్ మండలఅధ్యక్షుడిగా కవ్వంపల్లి రాము, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బింగి రాజు, సోషల్ మీడియా ఇంచార్జ్‌గా కవ్వంపల్లి సాయినాథ్‌లను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సీమా శీనన్న, గుండేటి ఐలయ్యల ఆదేశాల మేరకు ఈ ఎన్నికలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 15: మండలంలోని అశన్నపల్లిలో బీజేపీ నాయకుడు ముస్కు శ్రీకాంత్ తల్లి ఓదమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. మృతురాలి కుటుంబాన్ని ఆదివారం బీజేపీ నాయకుడు ఏగోలపు సదయ్యగౌడ్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి పుల్లూరి పృథ్విరాజ్, బీ జేపీ నాయకులు కూస రాజు, ముస్కు విజయ్, ఎరుకల నరేష్, పోతరాజు రుత్విక్, పెండ్లి అజయ్, కూస వెంకటేష్ పాల్గొన్నారు.

## దుప్పట్లు పంపిణీ

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 15: మండలంలోని మిర్జంపేటలో ఆదివారం సిరికొండ అరుణ, మధునయ్య దంపతులు 30మంది వికలాంగులకు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ పోసాల సదానందంగౌడ్, సిరికొండ శంకరమ్మ, సిరికొండ వీరస్వామి, సిరికొండ అజయ్, సిరికొండ అశోక్ పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదు

కమాన్‌పూర్, సెప్టెంబరు 15 : దేశం హితం కోరుకునే వారు బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు జంగపల్లి అజయ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంథని నియోజకవర్గ సభ్యత్వ ఇంచార్జీ మచ్చ గిరి రాము, సీనియర్ నాయకులు మట్ట శంకర్, మల్లారపు అరుణ్‌కుమార్, కోయడ సతీష్, బర్ల సదానందం, మట్ట మల్లేష్, వడ్లకొండ తిరుపతి, పంతకాని విశ్వతేజ, పిల్లి చంద్రయ్య,కొమ్ము శ్రీనివాస్, పిడుగు రమేష్, ఇరుగురాల రవీందర్ ఉన్నారు.

## ఆకట్టుకున్న యక్షగాన ప్రదర్శన

ధర్మారం, సెప్టెంబరు 15 : మండల కేంద్రంలోని సాయి మణికంఠ మోడ్రన్‌స్కూల్ ఆవరణలో శనివారం రాత్రి నిర్వహించిన భక్తమార్కండేయ యక్షగాన ప్రదర్శన ఆకట్టుకుంది. పాఠశాల కరస్పాండెంట్ జైన సురేష్‌కుమార్, పాఠశాల మేనేజ్‌మెంట్ డైరెక్టర్ జైన రమాదేవి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా మాంసం విక్రయాలు

### - పట్టించుకోని అధికారులు

జూలపల్లి, సెప్టెంబరు 15:మండల కేంద్రంలో కొన్నేళ్లుగా ఎలాంటి అనుమతులు లేకున్నా కొందరు యథేచ్ఛగా మాంసం విక్రయాలు జరుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దందాకు కొందరు స్థానిక రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో మండలంతోపాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ అడ్డగోలుగా సంపాదిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం గ్రామానికి వలస వచ్చిన కొందరు వ్యక్తులు ఓ కాలనీలోని ప్రభుత్వ భూమిలో గుడిసె వేసుకొని జీవిస్తూ, ఎలాంటి అనుమతులు లేకుండానే ఆవులు, ఎద్దులను తీసుకవచ్చి వధించి మాంసం విక్రయాలు సాగిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అయినప్పటికీ అధికారులెవరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పశువులను వధించిన తర్వాత వాటి వ్యర్థాలతో దుర్వాసన భరించలేకపోతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఈ విషయమై స్థానిక పోలీసులకు, కలెక్టరుకు ఫిర్యాదు చేసినా మాంసం వ్యాపారం ఆగడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 15: నగరంలోని కమాన్ చౌరస్తాలో గల పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఆదివారం విశ్వకర్మ భగవానుని బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం పతాకావిష్కరణ, బైక్‌ర్యాలీ, పుణ్యాహవాచనం, అంకురారోపణ, అగ్నిప్రతిష్ట జరుగగా మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గాయత్రీదేవి సామూహిక కుంకుమార్చన, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్, ధర్మకర్తలు శ్రీరామోజు నాగరాజు, వేములవాడ రవీంద్రాచారి, మియాపురం వీరబ్రహ్మాచారి, అనసూరి రమేష్, ముత్తోజు రామ్‌కుమార్, అస్నాపురం లీల, ఈఓ వుడుతల వెంకన్న, భక్తులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం మనుమయాది పంచబ్రహ్మలు, గాయత్రీ విశ్వకర్మ హవనం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అల్పాహారం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## గ్రామాల్లో బెల్టు తొలగేదెప్పుడో..?

- యథేచ్ఛగా బెల్టు షాపులు
- పట్టించుకోని అధికారులు

పాలకుర్తి, సెప్టెంబరు 15 : మండలంలోని పల్లెల్లో ఎక్కడ చూసినా బెల్టుషాపులు కనిపిస్తున్నాయి. తనిఖీలు చేయాల్సిన సంబంధిత శాఖల అధికారులు మౌనంగా ఉండడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పాలకుర్తి మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో ఊరూరా బెల్టుషాపులు జోరుగా కొనసాగుతున్నాయి. దీంతో యువత మద్యానికి బానిసై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా బార్లను మైమరపించే విధంగా బెల్టుషాపులు నడుస్తున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులకు పక్కా సమాచారం తెలిసినా నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు. మరోవైపు బెల్టుషాపుల నిర్వాహకులు అధిక ధరలకు మద్యం విక్రయాలు చేపడుతూ అందినంత దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాగా, ఈ విషయమై ఎక్సైజ్ సీఐ మంగమ్మను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.

# గణేష్ మండపాల్లో ప్రత్యేక పూజలు


గోదావరిఖనిలో పూజలు చేస్తున్న కొంకటి లక్ష్మణ్ దంపతులు


మంథనిలో పూజలు నిర్వహిస్తున్న పుట్ట మధు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 15: గణేష్ నవరాత్రుల చవరి రోజు అయిన ఆదివారం గోదావరిఖని పట్టణంలోని పలు మండపాల్లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణ్‌నగర్‌లోని వర్తక, వ్యాపార కేంద్రంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11వ డివిజన్‌లో నిర్వహించిన ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్వినిప్రకాష్ ఉన్నారు. 13వ డివిజన్ విఠల్‌నగర్ ఎస్‌సీ, ఎస్‌టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ, మంగ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 42వ డివిజన్ కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, మీనాక్షి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక దీపాలంకరణ, 108రకాల నైవేద్యాలను సమర్పించారు.

**మంథని :** మంథని పట్టణంలోని గాంధీచౌక్, పోచమ్మవాడ, సావిత్రీబాయి కాలనీ, శ్రీరామకాలనీ, ఎరుకలగూడెం, అంబేద్కర్‌నగర్ ఏరియాల్లో పలు వినాయక విగ్రహాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆయన సతీమణి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజతో కలిసి పుట్ట మధు ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గణపతి మండపాల వద్ద నిర్వాహకులు పుట్ట దంపతులను శాలువాలతో సన్మానించారు. ఎరుకలగూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న దాసరి మల్లయ్య, గుర్రాల లక్ష్మయ్య, గుజ్జుల రాధ, శ్రీపతి లక్ష్మిలను ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, కుమార్‌లు పాల్గొన్నారు.

**కోల్‌సిటీటౌన్ :** విశ్వహిందూ పరిషత్, గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖనిలో కోదండ రామాలయంలో గణపతి మండపాలకు స్వీట్ బాక్స్ పంపిణీ చేశారు. గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు కుర్మా సతీష్‌కు మార్, ఉత్సవ కమిటీ కార్యదర్శి జలంధర్, విభాగ కార్యదర్శి అయోధ్య రవీందర్, నగర కార్యదర్శి రవీందర్, కొండపర్తి లింగన్న, సంపత్, శ్రీనివాస్, చక్రపాణి, మో హన్, శ్యామ్, అరవింద్, రాజేష్, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

**కాల్వశ్రీరాంపూర్ :** మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న వినాయక మండపాల వద్ద గణపతి భక్తులు ఆదివారం అన్నదానాలు నిర్వహించారు. నవరాత్రులు ఆదివారం చివరి రోజు సందర్భంగా భక్తులు గ్రామగ్రామాన కుంకుమ పూజలు, తదితర పూజలు విఘ్నేశ్వరునికి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, మాజీ జెడ్‌పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**ఓదెల :** మండలంలోని భాయమ్మపల్లి హనుమాన్ ఆలయం వద్ద ఉన్న గణనాథునికి ఆదివారం 108 రకాల మహా ప్రసాదాన్ని సమర్పించారు. ఆదివారం నాటికి నవరాత్రులు పూర్తయిన చివరి రోజున మహిళ భక్తులంత ఉపవాస దీక్షలను పాటించి నైవేద్యంను సమర్పించారు. అలాగే ఓదెలతో పాటు పలు గ్రామాల్లో గణేశుని మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు. సోమవారం గణపతులను నిమజ్జనం నిర్వహించనున్నందున పోలీసు అధికారులు నిమజ్జనం చేసే స్థలాలను, చెరువులను, కుంటలను పరిశీలించారు.

**ధర్మారం :** మండల కేంద్రంలో పలు వినాయక మండపాల వద్ద ఆదివారం భక్తిశ్రద్ధలతో మహిళలు కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. దళిత కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు. అదేవిదంగా గణేష్‌నగర్‌లో వినాయకుని మండపం వద్ద దంతులు హోమాలు నిర్వహించారు. మేడారం వైపు వెళ్లే దారిలో గల హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద అన్నదానం నిర్వహించారు.

**పెద్దపల్లి కల్చరల్ :** పెద్దపల్లి పట్టణంలో గణపతి మంట బలం వద్ద ఆదివారం హోమాలు దీపారాధనలు అన్నదాన కార్యక్రమాలతో మంటపాల వద్ద భక్తులతో కిటకిటలాడాయి. వైశ్య భవన్, ప్రగతి నగర్ కూడలిలోనూ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోను అన్నదాన కార్యక్రమాలు జరగగా హనుమాన్ నగర్ శాంతినగర్ బృందావన్ కాలనీ భూంనగర్ తదితర కాలనీలలోని మండపాల వద్ద హోమాలు జరిపారు. వేద బ్రాహ్మణులచే పూజా కార్యక్రమాలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


గణపతి మండపంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

**పెద్దపల్లి రూరల్ :** మండలంలోని పలు గ్రామాల్లో గణపతి మండపాల వద్ద ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. పెద్దకల్వలలోని అంబేద్కర్ కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కల్వల విజయ్-కావ్య దంపతులు అన్నదానం నిర్వహించారు. అలాగే పెద్దకల్వల, అందుగులపల్లి గ్రామాల్లోని గణపతి మంటపాలను బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంట బీఆర్ఎస్, నాయకులు, కార్యకర్తలు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

**సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ పట్టణంలోని గౌడ వీధిలో బాలల గణనాథుని నిమజ్జన శోభాయాత్రను చిన్నారులు ఘనంగా నిర్వహించారు. అనంతరం సుల్తానాబాద్ పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. మాజీ సర్పంచ్ పుష్పలత-అన్నయ్యగౌడ్, మంద శ్రీనివాస్, అరెల్లి సతీష్, కెక్కర్ల శ్రీనివాస్, బత్తిని కృష్ణ, అన్నపూర్ణ, శ్రీనివాస్, నందిని, సమత, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.


భాయమ్మపల్లిలో మహిళల పూజలు


అందుగులపల్లిలో గణనాథుడి వద్ద పూజలు

## ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలి

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 15: ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలని సదాశయ ఫౌండేషన్ జిల్లా సలహాదారులు దేవి లక్ష్మీనర్సయ్య, మహిళా కాంగ్రెస్ టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ గడమల్ల వరలక్ష్మి అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన గోదావరిఖని రాంనగర్‌కు నివాసి దాసరి ఉపేందర్ నేత్రాలు దానం చేశారు. ఆదివారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదాత సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్రదాత కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ అభినందన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంఓల కంకణాల రాజు, నాంపల్లి రాజు, సుంకరి సంతోష్ పాల్గొన్నారు.

## తెలంగాణ అమరుల ఆశయాలతో ముందుకు సాగుదాం

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 15: తెలంగాణ సాయుధ పోరాట అమరుల ఆశయాలతో ముందుకు సాగాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం సూచించారు. తెలంగాణ సాయుధ పోరాట అమరుల వారోత్సవాల్లో భాగంగా ఆదివారం బస్టాండ్ వ్ద స్థూపానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూసల రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు కడారి తిరుపతి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆరేపల్లి మానస్ కుమార్, సీపీఐ, ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్ ప్రజాసంఘాల నాయకులు చంద్రగిరి ఉదయ్ కుమార్, పోశం లక్ష్మణ్, నరేష్, బాపు శంకర్, ఎల్లయ్య, అంజి, మనోజ్, లింగయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కాలనీని ప్రారంభించిన ఎమ్మెల్యే

కోల్‌సిటీ, సెప్టెంబరు 15: రామగుండం కార్పొరేషన్ 5వ డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వినాయకనగర్ కాలనీని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండం కార్పొరేషన్ అభివృద్ధికి రూ.120కోట్ల నిధులను తీసుకువచ్చినట్లు తెలిపారు. కాలనీల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా రోడ్లు, మంచీటి సౌకర్యం, డ్రైన్లకు శాశ్వత పరిష్కారం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్ కుమార్, నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్ మహంకాళి స్వామి, పొన్నం విద్య, కాలనీవాసులు నరేందర్‌కుమార్, వెంకటేష్, సురేందర్, కుమారస్వామి, సతీష్, సుద్దాల రాంచందర్ పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన


ఎల్లమ్మ గుండమ్మ చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, సీపీ

పెద్దపల్లి కల్చరల్/పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 15 : పెద్దపల్లి పట్టణంలో సోమవారం జరిగే వినాయక నిమజ్జనం సందర్భంగా ఎల్లమ్మ గుండమ్మ చెరువులో నిమజ్జన ఘాట్ ఏర్పాట్లను సీపీ శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే విజయరమణారావు పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జనం ప్రశాంతమైన వాతావరణంలో జరగాలని చర్యలు తీసుకోవాలని సీపీ, పోలీసు యంత్రాంగానికి, మున్సిపల్ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ చేతన, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, పోలీస్ ఉన్నత అధికారులు, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరుకాపు సంఘం అడహక్ కమిటీలు

ధర్మారం,సెప్టెంబరు 15: ధర్మారం మండల మున్నూరుకాపు సంఘం సభ్యత నమోదుకు గ్రామాల వారీగా అడహక్ కమిటీలను నియమించారు. ఆదివారం ధర్మారం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో జరిగిన మండల మున్నూరు కాపు సంఘం సమావేశానికి జిల్లా అధ్యక్షుడు మల్కా రామస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. ఈ నెల 25లోపు సభ్యత్వ నమోదు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈనెల 29న నామినేషన్లు స్వీకరించి అదే రోజు ఉపసంహరణతో పాటు అభ్యర్థులు పోటీలో ఉంటే బ్యాలెట్ ద్వారా ఈనెల 30న ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. సభ్యుల ఏకగ్రీవ తీర్మానంతో ఈ కమిటీలను జిల్లా అధ్యక్షుడి సమక్షంలో నియమించడం జరిగిందని మండల ప్రధాన కార్యదర్శి తన్నీరు రాజేందర్ ప్రకటించారు.

## ఘనంగా ఓనం వేడుకలు

జ్యోతినగర్, సెప్టెంబరు 15: ఓనం పండుగను ఆదివారం ఎన్టీపీసీలో ఘనంగా జరుపుకున్నారు. ఎన్టీపీసీలో పనిచేస్తున్న కేరళ ఉద్యోగులు, ఎన్టీపీసీలోని ఇండస్ట్రియల్ క్యాంటీన్(ఇండియన్ కాఫీ హౌజ్), ఇతర రెస్టారెంట్లలో పని చేస్తున్న కేరళకు చెందిన సిబ్బంది ఓనం పర్వ దినాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రంగు రంగుల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఐసీహెచ్ ఇండస్ట్రియల్ క్యాంటీన్లో జరిగిన ఓనం వేడుకలలో ఇన్‌చార్జి సీనియర్ మేనేజర్ బెన్ని, సిబ్బంది పాల్గొన్నారు.

## మిత్రుడికి ఆపన్నహస్తం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 15: తమతో చదువుకున్న చిన్ననాటి స్నేహితుడు అనారోగ్యం బారినపడడంతో సింగరేణి స్కూల్ స్నేహితులు ఆపన్నహస్తం అందించారు. 1993-94 బ్యాచ్‌కు చెందిన మహబూబ్ అలీ మధుమేహం బారినపడి చూపును కోల్పోయాడు. జీవనోపాధి లేకపోవడం, వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిన తోటి విద్యార్థులు రూ.1,63,000 చెక్కును ఆదివారం మహబూబ్ అలీకి అందజేశారు. ఈకార్యక్రమంలో మొగిలి, మురళీ, రాజమౌళి, ప్రభాకర్, జయాకర్ ఉన్నారు.

## రేపు విశ్వకర్మ యజ్ఞం

ఎలిగేడు, సెపెంబరు 15: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో ఈనెల 17న ఉదయం 9గంటలకు విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వారు సుల్తాన్‌పూర్ గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో కులాలకు, మతాలకు అతీతంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాజేశం అఖిల భారతీయ విశ్వకర్మ రాష్ట్ర అధ్యక్షుడు, గర్రెపల్లి నారాయణస్వామి, అఖిలభారతీయ విశ్వకర్మ జిల్లా అధ్యక్షుడు, గ్రామశాఖ అధ్యక్షుడు గర్రెపల్లి సురేందర్, శివపల్లి శ్రీనివాస్, సత్యం, సిరికొండ రమేష్, రాములు, రవీందర్, శ్రీహరి, సత్యనారాయణ, చెల్లూరు రంగయ్య తెలిపారు.

## ఐక్యమత్యంగా ఉండాలి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 15: పెద్దపల్లి జిల్లా పెయింటర్స్ సభ్యులు ఐకమత్యంగా ఉండాలని గ్లోబల్ పెయింటర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సయ్యద్ అన్నారు. జిల్లా కేంద్రంలో గ్లోబల్ పెయింటర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా సమావేశానికి గ్లోబల్ పెయింటర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సయ్యద్ మస్రత్ పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్లోబల్ పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్‌కె సయ్యద్, ఉపాధ్యక్షులు నాని, సమ్మయ్య, శ్రీనివాస్, విజయ్, సంపత్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## రహదారికి మరమ్మతులు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 15: సోమవారం వినాయక నిమజ్జనం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో గుంతల రహదారికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సహాయ సహకారాలతో మరమ్మతులు చేసినట్లు మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ అన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాదనవేన సదయ్య, నాయకులు ఎండీ మునీర్, అల్లం దేవేందర్, మాదాసి సతీష్, పోట్యాల మొండయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ జిన్న రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం కార్యవర్గం

జ్యోతినగర్, సెప్టెంబరు 15 : జ్యోతినగర్ ఏరియా శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా సూరం సత్యనారాయణ, అధ్యక్షుడిగా అనుమల భద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా జిల్లా కమలాకర్, కోశాధికారిగా మామిడాల బుచ్చిరాములు, ముఖ్య సలహాదారులుగా బూర రమణయ్య, మామిడాల చంద్రయ్య, మెంగళ బాపు, ఇల్లా మల్లేశం తౌటం శ్రీనివాస్, గుండేటి కిశోర్, రామస్వామి, ఉపాధ్యక్షులుగా శివశంకర్, రమేష్ ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పద్మశాలీల సంక్షేమానికి కొత్త కమిటీ కృషి చేస్తుందని ప్రకటించారు. అనంతరం కొత్త కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది.